క్లుప్తంగా

ప్రభుత్వ భూమిని సర్వే చేయాలి



నర్సంపేట : నర్సంపేట పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లోని సర్వే నంబర్ 111లోని భూమిని అధికారులు సర్వే చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కందికొండ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీబీఆర్పీ ఆధ్వర్యంలో ఆ సర్వే నంబర్ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఎంసీపీఐ(యూ) నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. భూమిని సర్వే చేసి పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు, జిల్లా నాయకులు రాపర్తి జగన్నాథం, అల్లం రాజక్క, గండికోట సమ్మక్క, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గణిపాక అశోక్, మండల ఇన్‌చార్జ్ కందికట్ల సురేశ్, నాయకులు మిట్టగడపుల రజిత, భువనగిరి సుజాత, జన్ను మానస పాల్గొన్నారు.

సెలూన్‌లో రూ.56 వేలు చోరీ

చెన్నారావుపేట: మండలంలోని జల్లీ గ్రామానికి చెందిన వల్లాజీ మహేందర్ సెలూన్‌లో గురువారం రాత్రి రూ.56 వేలు చోరీ జరిగింది. మహేందర్ స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సెలూన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. నూతన ఇంటి నిర్మాణం కోసం తీసుకొచ్చిన నగదుని గల్లా పెట్టెలో ఉంచి రోజూ మాదిరిగానే గురువారం రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికెళ్లాడు. అర్ధరాత్రి షాపు రేకులను తొలగించి గుర్తు తెలియని వ్యక్తులు గల్లా పెట్టెలోని రూ. 56 వేలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం షాపు తీసిన మహేందర్ చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాయపర్తి (వర్ధన్నపేట): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన డీసీ తండా సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. డీసీ తండాకు చెందిన సపావత్ గోవింద్‌నాయక్, వసంత్‌నాయక్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తండా సమీపంలో బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోవింద్‌నాయక్‌కు తీవ్ర, వసంత్ నాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పరామర్శ



నర్సంపేట రూరల్ : నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న సింగారపు ప్రదీప్‌ను అతడి తండ్రి ఎలీషా గురువారం మృతి చెందగా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ గోపాల్, సూపరింటెండెంట్ డాక్టర్ మనోజ్‌లాల్, ఎల్‌డీసీ సురేశ్ శుక్రవారం పరామర్శించారు. ఎలీషా మృతి బాధాకరమన్నారు. అనంతరం రూ.22 వేల ఆర్థికసాయం అందజేశారు.

గీత కార్మికుడికి..

దుగ్గొండి : మండలంలోని చలపర్తికి చెందిన గీత కార్మికుడు కోల యుగంధర్ ఇటీవల తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలై చికిత్స పొందిన క్రమంలో ఆయనను మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తామన్నారు. రమేశ్ వెంట నాయకులు మద్దెల సాంబయ్య, గొడిశాల అశోక్, అనగోని తిరుపతి, కోల శ్రీనివాస్, రడం రవీందర్, దూలం తిరుపతి, కోల మహేందర్, గోడిశాల రవీందర్ తదితరులున్నారు.

బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

పెద్దవంగర: సర్కార్ బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టుతుందని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలుశాఖల అధికారులతో సమీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో బడిబాట కార్యక్రమాన్ని జూన్ 3నుంచి 19వరకు పకడ్బందీగా నిర్వహించేలా ప్రతీ ఒక్కరు తమ వంతు తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈ విద్య సంవత్సరం కూడా పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అనంతరం మండలంలోని పలు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఏఈ అశోక్‌తో కలసి సందర్శించారు. పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, నోడల్ అధికారి కళాధర్, ఏపీఎం రమణాచారి, ఐసీడీఎస్ అధికారి కవిత, జీపీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అభయమిచ్చే ‘పంచముఖ’ ఆంజనేయుడు

నేడు హనుమాన్ జన్మోత్సవం

- కొండగట్టు తర్వాత అంతటి ప్రసిద్ధి
- దైవత్వం మూర్తీభవించిన ఆంజనేయస్వామి విగ్రహం



పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం



ఆంజనేయస్వామి విగ్రహం

గీసుకొండ (పరకాల) : మండలంలోని కోనాయమాకుల గ్రామ సమీపంలోని వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారి పక్కన ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం భక్తులకు అభయమిచ్చేలా అలరారుతోంది. నేడు (శనివారం) హనుమాన్ జన్మోత్సవ నేపథ్యంలో ఆలయానికి భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేయడం పరిపాటి. వరంగల్ నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి, పొరుగు జిల్లాల నుంచి మండల, అర్ధ మండల దీక్ష చేపట్టిన మాలధారులు ఆలయంలో దీక్ష విరమించనున్నారు. కరీంనగర్‌లోని కొండగట్టు తర్వాత హనుమాన్ భక్తుల దీక్షల స్వీకరణ, విరమణకు ఈ ఆలయం ప్రసిద్ధి.

కమనీయం స్వామి వారి మంగళ రూపం

ఆలయం అత్యంత ప్రాశస్త్యమైనది. నల్లని రాయితో మలచిన స్వామి వారి విగ్రహం దైవత్వం ఉట్టిపడేలా ఉంటుంది. జింకలగడ్డగా పిలిచే ఈ ప్రాంతంలో సామిల్ యజమాని, హనుమాన్ భక్తుడు సీతా లక్ష్మన్ సా 1992లో స్వామి వారి ఆలయాన్ని నిర్మింపజేశారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధ విగ్రహాన్ని మలచిన ప్రముఖ శిల్పి గణపతి స్తపతి అంతకంటే ముందుగానే ఇక్కడి పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని రూపుదిద్దారు. విగ్రహ తయారీ తర్వాత ఐదేళ్లపాటు భూమిలో నిక్షిప్తం చేసిన అనంతరం వెలికి తీసి ప్రతిష్ఠాపన చేయడం విశేషం. తద్వారా మహిమాన్విత శక్తులు ప్రాప్తిస్తాయని ప్రతీతి. స్వామి వారి ఆలయంలో 2006లో తూర్పు వైపు శ్రీరామనామ క్షేత్రాన్ని నిర్మించారు. ఈ క్షేత్రంలో సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు కొలువుదీరాయి. ఐదు ముఖాలు, పది భుజాలు, పది ఆయుధాలతో ఆంజనేయస్వామి విగ్రహం దర్శనం ఇసుత్తుంది. తూర్పు దిక్కున వానర ముఖం, దక్షిణాన నారసింహ, పశ్చిమాన గరుడ, ఉత్తరాన వరాహ, పైభాగంలో హయగ్రీవ ముఖాలతో కనిపిస్తుంది. ఎడమ వైపు చేతుల్లో డాలు, పర్వతం, రామనామ పుస్తకం, సంజీవనీ పర్వతం, కపాలం, కుడి వైపు ఖడ్గం, సర్పం, నాగలి, గధ, కలశం దర్శనం ఇస్తాయి.

శత్రుగర్వాన్ని అణచడానికే పంచముఖ అవతారం

శత్రువుల గర్వాన్ని అణచి, జ్ఞానదీపాన్ని వెలగించి, మోక్షప్రాప్తి సిద్ధింపజేయడానికే ఆంజనేయస్వామి పంచముఖ అవతారం ఎత్తినట్టు పండితులు చెబుతున్నారు. రాముడు రావణాసురుడిని సంహరించిన తర్వాత సంతృప్తి చెందుతుండగా శతకంఠుడనే రాక్షసుడు దుష్టుడని విని, అతడిని సంహరించాలని నిర్ణయించుకుని ఆ దిశగా శ్రమిస్తున్న క్రమంలోనే హనుమంతుడు పంచముఖ అవతారం ఎత్తి భీకర యుద్ధం చేసినట్టు చరిత్ర చెబుతోంది.

హనుమాన్ జన్మోత్సవ కార్యక్రమాలు ఇవే..

దీక్షలు స్వీకరించిన హనుమాన్ భక్తులు మాల విరమణ చేయడానికి ఇక్కడికి తరలిరావడం పరిపాటి. శనివారం తెల్లవారుజాము నుంచి పూజా కార్యక్రమాలు మొదలవుతాయి. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్తలు శ్రీ సీతా అనంద్ సా అండ్ బ్రదర్స్, ప్రధాన అర్చకుడు జాగర్లపూడి అయ్యప్పశర్మ తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ముందు రోజు (శుక్రవారం) రాత్రి హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నర్సంపేట రూరల్ : భోజ్యానాయక్‌తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ స్వాములు

- దీక్ష విరమణకు తరలిన మాలధారులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, నెక్కొండ, చెన్నారావుపేట, ఖానాపురం, దుగ్గొండి మండలాల్లోని ఆలయాల్లో హనుమాన్ మాలధారులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాల విరమణ కోసం కొండగట్టు, భద్రాచలంల్లోని ఆలయాలకు తరలివెళ్లారు. నర్సంపేట మండలంలోని భోజ్యానాయక్‌తండాకు చెందిన హనుమాన్ మాలధారులు ఇరుముడి కట్టుకుని కొండగట్టు, భద్రాచలంకు బయలుదేరారు. తొలుత గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. నల్లబెల్లిలోని సీతారామాంజనేయస్వామి, తదితర ఆలయాల్లో గురుస్వాములు మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం మాలధారులు కొండగట్టు, భద్రాచలం, విజయవాడ, గీసుగొండ, తిరుపతి పుణ్యక్షేత్రాలకు బయల్దేరారు. నెక్కొండలోని ఆంజనేయ స్వామి ఆలయంలో గురుస్వామి పెద్దకాసు కొమ్మాలు హనుమాన్ మాలధారులకు ఇరుముడి కట్టగా వారు కొండగట్టు, శ్రీశైలం, పొన్నూరు అభయ హనుమాన్ ఆలయాలకు వెళ్లారు. చెన్నారావుపేటలో మాలధారులు నగర సంకీర్తన నిర్వహించి భజన చేశారు. భద్రాచలం, కొండగట్టు, గీసుకొండ, తిరుపతితో పాటు పలు పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. ఖానాపురంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో మాలధారులు నాజీతండా, బుధరావుపేటతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాలకు సందర్శించి ఇరుముడులతో భద్రాచలం వెళ్లారు. దుగ్గొండి మండలంలోని వెంకటాపురం, నాచినపల్లి, తొగర్రాయి గ్రామాలకు చెందిన హనుమాన్ మాలధారుల్లో కొందరు భద్రాచలం, ఇంకొందరు కొండగట్టులో మాలవిరమణకు బయల్దేరి వెళ్లారు.

జోరుగా.. హుషారుగా చెన్నారంలో వనభోజనాలు



రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన యాదవ కులస్తులు శుక్రవారం జోరుగా.. హుషారుగా వనభోజనాలకు తరలివెళ్లారు. గ్రామ దేవతలైన మదీనమ్మ మహంకాళి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు మంచిగా పండాలని మొక్కుకున్నారు. యాదవ కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కుటుంబాలతో కలిసి వనభోజనానికి వెళ్లి విందు భోజనాలు చేసుకుని సంతోషాన్ని పంచుకున్నారు. ఆనంద డోలికల్లో తేలియాడారు. భవిష్యత్‌లోనూ ఇలాంటి కార్యక్రమాలు ఐక్యంగా నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు. వనభోజనాలతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కుల పెద్దమనిషి మంద ధర్మయ్య, సారిగొల్ల మంద సారంగం, సర్పంచ్ మంద రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూమిని కాపాడాలి



వినతిపత్రం ఇస్తున్న స్వామి, తదితరులు

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ పరిధిలోని అక్కల్‌చెరువు శిఖం భూమిని కాపాడాలని మగ్దుంపురం పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు బోనగిరి స్వామి, ముదిరాజ్ కుల పెద్దమనిషి ముత్యం యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఫణికుమార్‌కు స్వామి, యాకయ్య ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం వినతిపత్రం అందించింది. అనంతరం స్వామి, యాకయ్య మాట్లాడారు. సర్వే నంబర్ 245లో 40.25 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందన్నారు. ఇటీవల చెరువు సమీపంలో భూమి కొన్న కొందరు రైతులు చెరువులో మొరం పోసి పూడ్చి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. చెరువులో మట్టిపోసి ఆక్రమించుకుంటుండడంతో నీటి మట్టం తగ్గి ఆయకట్టు సాగుకు ఇబ్బంది తలెత్తుతోందని చెప్పారు. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కులపెద్దలు పెద్దమ్మల రాజేందర్, ముత్యం వీరస్వామి, రాజయ్య, తూటి రమేశ్, సంఘం డైరెక్టర్లు ముత్యం భద్రయ్య, సదానందం, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణ జయంతి



చెన్నారావుపేట : ప్రముఖ సినీ హీరో, సూపర్ స్టార్ కృష్ణ జయంతిని ఆయన వీరాభిమాని గొడిశాల స్వామి శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు మండల కేంద్రంలో సినీ హీరో కృష్ణ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కాగా స్వామి కృష్ణ జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహిస్తూ అభిమానాన్ని చాటుకుంటున్నాడు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు వనపర్తి నర్సయ్య, కందుల స్వామి గౌడ్, ఇల్ల సూరయ్య, పోలెపల్లి భిక్షపతి, ననుమాస గవాస్కర్, స్వామి పాల్గొన్నారు.

గోవులకు దాణా పంపిణీ



తొర్రూరు: ప్రతీ ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని శివయాద్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు నడిగడ్డ శైలజ అన్నారు. స్థానికులు నడిగడ్డ యాదగిరి, శివాని ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని శివయాద్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని గోశాలలో గోవులకు దాణా, కూరగాయలు శుక్రవారం అందించారు. అనంతరం శైలజ మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్టు గౌరవ అధ్యక్షుడు జలకం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీశాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, స్థానికులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ



రవీందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు, బంధువులు

నర్సంపేట : నర్సంపేట నీటి పారుదల శాఖ సెక్షన్ ఇంజనీర్ తుమ్మల వెంకటేశ్వర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చెన్న రవీందర్‌రెడ్డిల ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పట్టణంలోని ఐఎంఏ హాలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ పర్యవేక్షణ ఇంజనీర్ విజయభాస్కర్‌రావు, సల్మాన్‌రాజు, ఉద్యోగుల ఆధ్వర్యంలో వెంకటేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డిలను ఉద్యోగులు, బంధువులు సన్మానించారు. చెన్నం రవీందర్‌రెడ్డి దంపతులను డెంటల్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ ప్రీతం కుమార్, జితేందర్, రఘునాథ్, రవికృష్ణ, భరత్ రెడ్డి, ప్రణయ్, లింగమూర్తి, కిట్స్ ప్రొఫెసర్ మారాము, న్యాయవాది దాస్యం రంగనాథస్వామి, శ్రీధర్ పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

హనుమాన్ జయంతి



వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని శ్రీలక్ష్మీ గణపతి సహిత అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఉదయం వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, అన్ని సెక్షన్ల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, హనుమాన్ మాలధారులు, రైతులు, వ్యాపారులు, మార్కెట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

450 ట్రాక్టర్ల మట్టి ఇసుక డంప్ సీజ్

ఐనవోలు : సుమారు 450 ట్రాక్టర్ల మట్టి ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై గైకడి అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని నందనం గ్రామ పంచాయతీ రెవెన్యూ శివారులో మట్టితో కూడిన ఇసుక డంప్ నిల్వ ఉందని సమాచారం మేరకు రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులు శుక్రవారం నిర్వహించారు. బుర్ర రాజ్‌కుమార్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా లింగం రామచంద్రారెడ్డికి చెందిన పట్టా భూమిలో సుమారు 450 ట్రాక్టర్ల మట్టి ఇసుకను నిల్వ చేసినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించి సీజ్ చేశారు. మైనింగ్ నిబంధనల మేరకు సదరు వ్యక్తులకు జరిమానా విధించడంతో తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. మట్టిని ఇసుక డంప్‌ను అక్రమంగా ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దాడుల్లో తహసీల్దార్ విక్రమ్ కుమార్, మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వి.చంద్రకళ, మైనింగ్ సర్వేయర్ ఏ.పూర్ణ, ఏఆర్ఐ మల్లయ్యలు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



నెక్కొండ : తనిఖీ చేస్తున్న సీఐ, అధికారులు

నెక్కొండ : ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చంద్రమోహన్ స్పష్టం చేశారు. మండలంలోని పలు ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ షాపులను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సీఐ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాల్లో నిషేధిత, నకిలీ విత్తనాలు విక్రయించొద్దని చెప్పారు. నాసిరకం ఎరువులు, మందులు విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. దుకాణాల్లో నిల్వలకు సంబంధించిన సమాచారంతో కూడిన బోర్డులు ప్రదర్శించాలని, ఎమ్మార్పీకే విక్రయించాలని స్పష్టం చేశారు. రైతులను మోసగించే వారిపై పీడీ యాక్ట్‌పై ప్రయోగిస్తామన్నారు. నిబంధనలు పాటించని డీలర్లపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో పూర్తి వివరాలు నమోదు చేసి రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. అనంతరం దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల స్టాక్‌తోపాటు రిజిస్టర్లను సీఐ, ఏఈఓలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని జల్లి, చెన్నారావుపేట, అమీనాబాద్, ఉప్పరపల్లి, కోనాపురంల్లోని షాపులను సీఐ చంద్రమోహన్, ఏఓ శశికాంత్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. ఎస్సై గూడ అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మైక్రో ఏటీఎంలతో మరిన్ని సేవలు



పాసు బుక్ ప్రింటర్‌ను ప్రారంభిస్తున్న మేనేజర్

- బ్యాంక్ మేనేజర్ సుల్తాన్ వెంకయ్య

సంగెం : మైక్రో ఏటీఎం సేవలను విస్తృత పర్చుతున్నట్టు గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ సుల్తాన్ వెంకయ్య తెలిపారు. మండల కేంద్రంలోని మైక్రో ఏటీఎం తొలిసారిగా వరంగల్ రీజియన్‌లో ఆ బ్యాంకు మిత్ర నెల్లుట్ల సుహాసినీ వద్ద ఎఫ్‌సీ పాస్ బుక్ ప్రింటింగ్ సేవలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే గ్రామీణ ప్రాంతాల్లో మైక్రో ఏటీఎం సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. బ్యాంకు ఖాతాదారులందరూ ఉచితంగా పాస్ బుక్ ప్రింటింగ్ సేవలను పొందవచ్చని చెప్పారు. పాస్ బుక్ ప్రింట్ చేయించుకుంటేనే లావాదేవీల్లో పారదర్శకత ఉంటుందని తెలిపారు. మిగిలిన బ్యాంకు మిత్రల వద్ద కూడా ప్రింటింగ్ మిషన్లను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు బ్యాంకు ద్వారా మరింత మెరుగైన సేవలు అందించే దిశగా ప్రణాళికాయుతంగా సాగుతున్నట్టు తెలిపారు. ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా బ్యాంకు కార్యాచరణ చేపడుతోందని వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు క్యాషియర్ జగదీశ్, ఉద్యోగి రాజు, ఐరిక్స్ మేనేజర్ కక్కెర్ల అనిల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సతీశ్

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మైన సురేశ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నాగరాజుపై స్వేరోస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. నాగరాజు అనేక మంది బహుజనుల పిల్లలకు చదువుల కోసం శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బహుజనుల ఆత్మగౌరవాన్ని దొరల దగ్గర తాకట్టుపెట్టారని ధ్వజమెత్తారు. స్వేరోస్ పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు ఐత ప్రవీణ్‌కుమార్, బెజ్జం పాపారావు, ఐత యాకాంతం, సిలువేరు శ్రీధర్ యాదవ్, ఐత సుధాకర్, మహ్మద్ సొహేల్, కొండేటి సుధాకర్, రామగిరి వంశీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజు మచ్చలేని నాయకుడు..

ఎమ్మెల్యే నాగరాజును మచ్చలేని నాయకుడిగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బర్ల సతీశ్ అభివర్ణించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మడత ప్రశాంత్, బర్ల రవి, కార్తీక్, లింగరాజు, నగేశ్, సురేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే పేదల రాజ్యస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

నర్సంపేట రూరల్ : బలమైన ఉద్యమాలతోనే పేదల రాజ్యస్థాపన జరుగుతుందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాయల చంద్రశేఖర్, గడ్డం సదానందం, పాయం చిన్న చంద్రన్న స్పష్టం చేశారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరంలోని అమరవీరుల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన ఆ పార్టీ రెండో రోజు శిక్షణా తరగతుల సందర్భంగా వారు మాట్లాడారు. గడిచిన 50 ఏళ్లుగా పేదల రాజ్యస్థాపన కోసం అనేక రకాల పోరాటాలు జరిగాయని తెలిపారు. నేటికి ప్రజాఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. గాంధీల రాజ్యం ముగిసి గాడ్సేల రాజ్యాలు వచ్చినా, కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నప్పటికీ రాజ్యాధికారం సాధించలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వెలిబుచ్చారు. దేశంలో పేదల రాజ్య స్థాపన దిశగా విప్లవ కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో 50 ఏళ్లుగా అడవిబాట పట్టిన ఉద్యమాలు, పోరాటాలు తెలిసిందేనని చెప్పారు. గత అనుభవాలను సమీక్షించుకుని విప్లవ శక్తులు విడివిడిగా ఉంటే ప్రయోజనం లేదన్న వాస్తవాన్ని గుర్తించి దేశవ్యాప్తంగా ఉన్న విప్లవ సంఘాలన్నిటినీ ఏకం చేయాలనే సంకల్పంతో ఈ ఏడాది మార్చి మొదటి వారంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ (ఎంఎల్) రెవల్యూషనరీ ఇనిషియేటివ్, సీసీసీ సీపీఐ(ఎంఎల్) ఐక్యంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అఖిల భారత విప్లవ పార్టీగా ఏర్పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మైదం పాణి, అర్షం అశోక్, శ్రీనివాస్, స్వామి, కొత్తపల్లి శివ, అడ్డూరి రాజు, దార లింగయ్య, మల్లేశ్, మధుసూదన్‌రెడ్డి, కొమ్ము రయ్య తదితరులు పాల్గొన్నారు.

3న పెయింటింగ్ పోటీలు

హన్మకొండ చౌరస్తా: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ ఈనెల 3న ‘మన నేల–మన భవిష్యత్, భూపునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు నివారణ’ అంశంపై విద్యార్థులకు వరంగల్ మట్టివాడలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉదయం 10:30 గంటలకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామని ఈఈ సునీత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభావంతులకు 5న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు.